సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం। 27। సెప్టెంబర్। 2024



సోమశిలలో 53.275 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం నాటికి 53.275 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 19,032 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,970
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,074
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,286
నవర (8 గ్రాములు)	రూ.58,288

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.8 /26.5

జిల్లాలో శుక్రవారం పొడి వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గురువారం గాలిలో తేమ 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో పలువురు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్‌గా పి.దయాసాగర్, నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డీపీఈవో)గా ఎ.శ్రీనివాసులు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వారికి సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగుల భవిష్యనిధిపై సమావేశం నేడు

నెల్లూరు(సెంట్రల్): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సమావేశం 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు అసిస్టెంటు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి వల్లూరు సుబ్రమణ్యంలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సమస్యల పరిష్కారానికి రామలింగాపురంలోని శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూలులో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తర కాలువకు నీటి విడుదల

- సాగు, తాగునీటికి ఉపయోగం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం

సోమశిల: సోమశిల ప్రాజెక్ట్ నుండి ఉత్తర కాలువకు నీటిని గురువారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విడుదల చేశారు. అంతకు ముందు ప్రాజెక్ట్ పంపు హౌస్ వద్ద పూజాధికాలు నిర్వహించారు. మంత్రి ఆనం విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గ రైతులకు సాగునీటితో పాటు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉత్తర కాలువకు నీరు విడుదల చేశామన్నారు. ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని, నీటి పరిణామాన్ని బట్టి కాలువ కెపాసిటీ మేరకు పెంచుతామన్నారు. రెండు రోజుల్లో ఆత్మకూరు రిజర్వాయర్‌కు చేరిన నీరు అనంతరం రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు చేరుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు రూ.12 కోట్ల దేవాదాయశాఖ నిధులతో సోమేశ్వరాలయాన్ని పునఃనిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ మధులత, సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు యువకుల అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రైల్వే సీఐ

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరులోని రైల్వే పోలీసుస్టేషన్‌లో సీఐ భుజంగరావు గురువారం నిందితుల వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన లెనిన్, అమయప్పన్‌లు కొంతకాలంగా ఒడిశా, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. గంజాయి అక్రమ రవాణాపై రైల్వే పోలీసులు దృష్టిసారించారు. అందులో భాగంగా గురువారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న లెనిన్, అమయప్పన్‌ను అదుపులోకి తీసుకుని వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో ఉన్న ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు.

నకిలీ బంగారం తాకట్టుతో రూ.25 లక్షల రుణం

లింగసముద్రం: నకిలీ బంగారం బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.25 లక్షల మేర రుణం తీసుకున్న వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటన లింగసముద్రం మండలంలోని మొగిలిచర్ల కెనరా బ్యాంకులో చోటుచేసుకుంది. మొగిలిచర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఐదు నెలల క్రితం నకిలీ గిల్టు నగలను బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.25 లక్షలు తీసుకున్నాడు. బ్యాంకు తనిఖీల్లో భాగంగా గురువారం అవి గిల్టు నగలని గుర్తించి అధికారులు విస్తుపోయారు. ఈ విషయమై బ్రాంచ్ మేనేజర్‌ను వివరణ కోరగా బ్యాంకులో తాకట్టు పెట్టిన నగల గురించి పైఅధికారులకు తెలియజేశామని వారు తనిఖీ చేసిన తరువాత వివరాలు తెలుపుతామని చెప్పారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసుల పచ్చపాతం

- అధికార పార్టీ దోపిడీకి జీ హుజూర్
- ఇతరులపై మాత్రం వేధింపులు
- ఇసుక, మట్టి తరలింపులో వివక్ష
- యథేచ్ఛగా సహజ వనరుల అక్రమ రవాణా



రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేతలు

నెలక్రితం

కొండాపురం మండలం మర్రిగుంటలో వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్ గోపి రెండు నెలల క్రితం తమ పట్టా పొలంలో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ ద్వారా వేరే వ్యవసాయ పొలాలకు తరలిస్తుండగా, అధికార పార్టీ నేతల సమాచారం మేరకు కొండాపురం ఎస్సై మహేంద్ర ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దీంతో మైనింగ్ అధికారులు రూ.75 వేలు పెనాల్టీ విధించారు.

వారం క్రితం

ఈ నెల 20వ తేదీన గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ట్రాక్టర్ల ద్వారా జేసీబీలతో గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో సర్పంచ్ వాటిని అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. కానీ అదే ఎస్సై మహేంద్ర అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కేసులు లేకుండానే ట్రాక్టర్లు, జేసీబీలు వదలి వేశారు. ఈ సంఘటనలు పోలీసు వ్యవస్థలో విలువలు ఎలా పతనం అవుతున్నాయో స్పష్టం చేస్తోంది.



మర్రిగుంటలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు (ఫైల్)

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇసుక, మట్టి దోచుకుంటున్నారంటూ రాద్ధాంతం చేసిన టీడీపీ నేతలు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక డంపులపై పడి దోపిడీ చేయడం ఆరంభించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇసుక, మట్టి, తెల్లరాయి లాంటి ప్రకృతి వనరులను లూటీ చేస్తున్నారు. అధికారుల అండదండలతో రేయింబవళ్లు ఇసుక, మట్టి అక్రమ రవాణా చేస్తూ రూ.లక్షల్లో కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. తమ అవసరాల నిమిత్తం సామాన్య రైతులు, ఇతరులు ఎవరైనా ఒక ట్రిప్పు ఇసుక, మట్టి తరలించినా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు అనే ముద్ర వేసి వాహనాలు సీజ్ చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు తమ విధులు, బాధ్యతలు మరిచి స్వామి భక్తి ప్రదర్శిస్తూ అధికార పార్టీ నేతలకు దాసోహమవుతున్నారు. ఈ తంతు ఉదయగిరి నియోజకవర్గంలో యథేచ్ఛగా జరుగుతున్నా ఆపేవారు లేరు. అడిగే దిక్కు అంతకైనా లేదు.

రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు

ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, కొండాపురం, సీతారామపురం మండలాల్లో అధికార పార్టీ నేతలు ఇసుక, మట్టి నిత్యం అక్రమంగా తరలించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు కిమ్మనడంలేదు. ఉదయగిరి, దుత్తలూరు, కొండాపురం, వింజమూరు మండలాల పరిధిలో ఉన్న పిల్లాపేరు వాగు నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఉదయగిరి మండలం తిరుమలాపురం వద్ద పిల్లాపేరు వాగు నుంచి రోజూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. వరికుంటపాడు మండలం తూర్పు బోయమడుగుల, కాంచెరువు, జడదేవి, కనియంపాడు, రామదేవులపాడు, గణేశ్వరపురం, కొండాపురం మండలం ఇస్కదామెర్ల, కోవివారిపల్లి వద్ద ఉన్న పిల్లా పేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా నిత్యం ఇసుక తరలిస్తున్నారు. ఆ ఇసుకను పామూరు, వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి మండల కేంద్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. దూరాన్ని బట్టి ఒక ట్రిప్పు ట్రాక్టరు ఇసుక రూ.2500 నుంచి రూ.4వేల వరకు అమ్ముతున్నారు. ఒక ట్రాక్టరు యాజమాని రోజుకు ఖర్చులు పోగా రూ.10వేలు వరకు సంపాదిస్తున్నారు. దీంతో అనేక మంది టీడీపీ నేతలు ఇసుక రవాణాను ఉపాధిగా మార్చుకున్నారు. ఈ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో పలువురు తెలుగు తమ్ముళ్లు కొత్తగా ట్రాక్టర్లు కొనుగోలు చేసి ఇసుక అక్రమ రవాణాకు వినియోగిస్తున్నారు.



జలదంకి మండలంలో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

మట్టిదీ అదే తంతు

వింజమూరు మండల కేంద్రంలో ఉన్న మల్లపరాజు చెరువు నుంచి నిత్యం రాత్రి వేళల్లో మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఇళ్లు కట్టుకునే సామాన్య ప్రజలకు ట్రిప్పు మట్టి కావాలన్నా దొరకడం లేదు. కానీ బడా బాబులకు మాత్రం మట్టి ఎంత పరిమాణంలోనైనా అట్టే దొరుకుతోంది. నిబంధనలు గాలికి వదలేసి అక్రమంగా మట్టి రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మట్టి తవ్వేందుకు ముందుగా అనుమతులు తీసుకొని ఒక క్యూబిక్ మీటరు మట్టికి గనుల శాఖకు రూ.46, ఇరిగేషన్‌కు రూ.146 చెల్లించాలి. ఇవేమి లేకుండానే అక్రమంగా తరలిస్తూ, ఒక ట్రాక్టరు మట్టి రూ.1000, ట్రిప్పర్‌కు రూ.3వేలు వసూలు చేస్తున్నారు. జలదంకి, దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో చెరువుల నుంచి ఇటుక బట్టీలకు కూడా మట్టి తరలిస్తున్నారు. దీని వెనుక పోలీసులకు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

సామాన్యులపై వైఎస్సార్‌సీపీ ముద్ర

అధికార పార్టీ వారు తప్ప వేరే ఎవరైనా తమ అవసరాల కోసం ట్రాక్టరు ట్రిప్పు మట్టి, ఇసుక తోలే ప్రయత్నం చేసినా వెంటనే పోలీసులు వాలిపోయి కేసులు నమోదు చేస్తున్నారు. ఆ వాహనాల యాజమానులపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేస్తున్నారు. ఆ పార్టీకి సంబంధం లేని వారిపై కూడా వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి ఇబ్బంది పెడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కొంతమంది నేతలు వైఎస్సార్‌సీపీ వదిలి టీడీపీలో చేరి ఓట్లు వేశారు. కానీ వారి వాహనాలను కూడా పోలీసులకు పట్టించి కేసులు నమోదు చేస్తున్నారు. మొత్తమ్మీద అధికార పార్టీ నేతలకు నియోజకవర్గంలో ఇసుక, మట్టి కాసుల పంట పండిస్తోంది. సామాన్యులకు ఇసుక కొరత తీరని కడుపుకోతగా మారింది.

45 రోజుల కిందట



ప్రతిపక్షానికి చెందిన వ్యక్తి ట్రాక్టరును స్వాధీనం చేసుకుని వరికుంటపాడు పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం (ఫైల్)

వరికుంటపాడు మండలం కనియంపాడు పిల్లాపేరు నుంచి 45 రోజులు క్రితం ఓ సామాన్య వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం జేసీబీ ఉపయోగించి ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తుండగా అధికార పార్టీకి చెందిన నేతల సమాచారం మేరకు అప్పటి ఎస్సై తిరుపతయ్య వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి మైనింగ్ అధికారులకు బదిలీ చేశారు. దీంతో వారు రూ.లక్ష పెనాల్టీ విధించారు.

నెల కిందట

ఇదే వాగు నుంచి ఇసుక తరలిస్తున్న అధికార పార్టీ నేతల ట్రాక్టర్లను కొంతమంది అడ్డుకుని పోలీసులకు పట్టించారు. కానీ అవి అధికార పార్టీ నేతలకు చెందినవి కావడంతో కేసు లేకుండానే రాచమర్యాదలతో పోలీసులు సాగనంపారు. దీనిని బట్టి చూస్తే... అధికార పార్టీ వారు ఎన్ని అక్రమాలు చేసినా ఒప్పే. ఇతరులు చేస్తే మాత్రం తప్పు అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది.

భూసేకరణ పనులు పూర్తిచేయండి

- రైతులకు పరిహారం చెల్లించండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, రైల్వే లైన్స్ నిర్మాణాల కోసం చేపట్టిన భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో భూసేకరణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములకు బిల్లులు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రతిపాదనలు వెంటనే కలెక్టరేట్‌కు పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హైవే ఆథారిటీ, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైవే నిర్మాణ పనులకు అవసరం మేరకు గ్రావెల్ తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా పెన్నానది మీద ఎన్‌హెచ్-67పై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం, ఎన్‌హెచ్ 167బీజీ, సీతారామపురం - దుత్తలూరు - కావలి రహదారుల ప్రగతిని సమీక్ష చేశారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ పూజ, నెల్లూరు ఆర్డీఓ మలోల, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ పద్మావతి, జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంకే చౌదరి, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈ డీవీ రమణ, తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విద్యాసాగర్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈ రంగబాబు, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

కేజీబీవీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధనా సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన, బోధనేతర సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిన 2024-25 విద్యా సంవత్సరంలో భర్తీ చేస్తామన్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో పీజీటీ-15, సీఆర్టీ-6, పార్ట్‌టైం టీచర్లు-7, అకౌంటెంట్-1 కలిపి మొత్తం 29 పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు apkfbv.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలన్నారు. వయోపరిమితి ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18-42 ఏళ్లు ఉండాలన్నారు.



చిల్లర కోసం వేట

నేటి పిల్లలే.. రేపటి పౌరులని రాజకీయ నాయకులు, అధికారులు గొప్పగా ఉపన్యాసాలు చెబుతుంటారు. కానీ బడికి పోకుండా నిత్యం నెల్లూరు వద్ద పెన్నానదిలో చిల్లర నాణేలను ఏరుకునే ఈ చిన్నారులు మాత్రం వారికి కనిపించక పోవడమే విచిత్రం. రైల్లో వెళ్తూ ప్రజలు పెన్నమ్మకు సమర్పించే చిల్లర నాణేల కోసం పిల్లలు ప్రయత్నిస్తుండగా గురువారం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.


ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సీఎం గారి తాలూకానట!

అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ట్రాఫిక్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. కొందరు తమ వాహనాల నంబర్ ప్లేట్లపై ఫలానా వారి తాలూకా అని పెద్ద అక్షరాలతో రాయించి తిరుగుతున్నారు. వీరిని చూసి సాధారణ జనం విస్తుపోతున్నారు. ఓ వ్యక్తి నంబర్ ప్లేట్‌పై 'ఏపీ సీఎం గారి తాలూకా' అని రాయించుకోవడమే కాకుండా పసుపు రంగు డిజైన్‌పై ఏకంగా పార్టీ గుర్తు కూడా వేయించుకున్నాడు. దీనిపై రవాణా, పోలీస్ శాఖలు ఏం చేస్తాయో..





బియ్యాన్ని బొక్కేస్తున్నారు!

అధికార పార్టీ నేతల అక్రమ దందా

- కార్డుహోల్డర్‌లకు కేజీకి రూ.10 చెల్లింపు
- రేషన్ షాపుల నుంచే రైస్ మిల్లులకు..
- అక్కడ పాలిష్ పట్టి బహిరంగ మార్కెట్‌లోకి
- ప్రతి నెలా రూ.లక్షల్లో అక్రమ వ్యాపారం

కందుకూరు: పేదల కడుపు నింపేందుకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం అధికార పార్టీ నేతలకు ఆదాయ వనరుగా మారింది. బియ్యం పంచకుండా ప్రతి నెలా టన్నుల కొద్దీ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం అధికార పార్టీకి చెందిన కీలక నేతల కన్నుసన్నల్లో సాగుతోంది. బియ్యం వ్యాపారం వారి గుత్తాధిపత్యం కిందకు తెచ్చుకుని యథేచ్ఛగా అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీనికి ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ శాఖలకు చెందిన అధికారులు సహకారం అందిస్తుండటం గమనార్హం.

ప్రతి నెలా 1100 టన్నులు

కందుకూరు నియోజకవర్గంలో మొత్తం 177 రేషన్‌షాపులున్నాయి. వీటి పరిధిలో బీపీఎల్, ఏఏవై కలిపి దాదాపు 95 వేల రేషన్‌కార్డుదారులున్నారు. ఈ షాపుల ద్వారా ప్రతినెలా నియోజకవర్గంలో 1100 టన్నుల బియ్యం సరఫరా అవుతుండగా.. 55 రేషన్ వాహనాలను వినియోగిస్తున్నారు. అయితే ఈ 1100 టన్నుల్లో 90 శాతం మేర ప్రజలకు చేరడం లేదు. మొత్తం బ్లాక్ మార్కెట్‌కే తరలిపోతోంది. ప్రజల నుంచి నేరుగా డీలర్లే బియ్యం కొనుగోలు చేయడం, వాటిని అధికార పార్టీకి చెందిన నేతలకు విక్రయించడం, వారు వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించడం ఓ సైకిల్‌లా జరుగుతోంది. బియ్యం రేటు కూడా అధికార పార్టీ నేతలే నిర్ణయించుకుని విక్రయిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రతి నెలా అధికార పార్టీ నేతలు రూ.లక్షల్లో ఆదాయాన్ని గడిస్తుంటే, అసలు లబ్ధిదారులైన పేదలకు ఆకలి కేకలు తప్పడం లేదు.

గంజికీ దిక్కులేదు..

వాస్తవానికి రేషన్ సరఫరా వాహనాల ద్వారా లబ్ధిదారులకు ప్రతినెలా ఇంటి వద్దనే బియ్యం సరఫరా చేయాలి. కానీ ఇక్కడ పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. ఇలా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరఫరా చేస్తారు. కానీ లబ్ధిదారులతో కేవలం వేలిముద్రలు వేయించుకుని నగదు ఇచ్చి పంపుతున్నారు. బియ్యం కావాలని అడిగేవారిని కసురుకొని పంపిస్తున్నారు.

అధికార పార్టీ వారికే విక్రయించాలి

గత నెలలో కందుకూరు పట్టణం, మండల పరిధిలోని రేషన్ షాపులకు తరలించిన బియ్యాన్ని 30వ తేదీనే లారీల ద్వారా బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. అంటే ఒక్క కేజీ కూడా పంచలేదు. ఇలా రేషన్ షాపులకు.. అటు నుంచి బ్లాక్ మార్కెట్‌కు తరలించడం పరిపాటిగా మారింది. బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్న కీలక నేతలకే డీలర్లంతా బియ్యం విక్రయించాలని, ఎవరైనా ఇతరులు వ్యాపారం చేస్తే పోలీసులు పట్టిస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. సంపూర్ణ సహకారం అందిస్తున్న అధికారులు ఈ మొత్తం రేషన్ మాఫియాను నడిపించడంలో సివిల్ సప్లయిస్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖకు చెందిన అధికారులు తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకపోయినా వచ్చినవి వచ్చినట్లు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ రేషన్‌షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వాహనాలను సరిహద్దులు దాటించడంలో పోలీస్ అధికారులు తమ పాత్రను తుచ తప్పకుండా పాటిస్తున్నారు. మాట వినని రేషన్ డీలర్లను వేధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.

కూటమి ఆధ్వర్యంలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి వరకు పనిచేస్తున్న రేషన్ డీలర్ల మొత్తాన్ని తొలగించి వారి స్థానంలో అధికార పార్టీకి చెందిన నాయకులను రేషన్ డీలర్లుగా నియమించారు. వారితో కీలక నేతలు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యాన్ని తాము చెప్పిన వారికే విక్రయించాలనే షరతు విధించారు. ఆ మేరకు ప్రతి నెలా రేషన్ డీలర్లు తమ షాపునకు కేటాయించిన బియ్యాన్ని నేరుగా లబ్ధిదారులకు ఇవ్వకుండా వారే కొనుగోలు చేస్తారు. లబ్ధిదారుడికి కేజీకి రూ.10 నుంచి రూ.12 చెల్లిస్తున్నారు. డీలర్ లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని సంబంధిత మండలంలో రేషన్ బియ్యం వ్యవహారం చూస్తున్న కీలక నేతలకు విక్రయించాలి. ఇలా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఇద్దరు చొప్పున మాఫియా నడిపిస్తున్నారు. ఆయా మండలాలకు నియమించిన నేతలు నేరుగా డీలర్లకే కేజీకి రూ.16 చెల్లించి కొనుగోలు చేస్తారు. ఆ తరువాత మండలాల నాయకులు నియోజకవర్గ స్థాయిలో వ్యవహారాన్ని చూసే వారికి వీటిని విక్రయించాల్సి ఉంటుంది. వీరు మరో రెండు రూపాయలు ఆదాయం చూసుకుని వారికి విక్రయిస్తారు. ఇలా సేకరించిన బియ్యం మొత్తాన్ని ఓగూరు వద్ద ఓ రైస్ మిల్లు, పామూరు రోడ్డులోని రైస్ మిల్లులో ఉంచి వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. కేజీకి రూ.27 చొప్పున జాతీయ రహదారిపై ఉన్న ఓ కంపెనీకి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఇలా ప్రతినెలా టన్నుల కొద్దీ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతోంది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో ప్రసాద్ మృతదేహం

పొదలకూరు: మండలంలోని సూరాపాళెం చేపల గుంత వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. సంగం ప్రాంతానికి చెందిన బొప్పూరు ప్రసాద్ (37) సూరాయపాళెం వద్ద చేపల గుంత నిర్వహిస్తున్నాడు. మోటార్ వేసేందుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి పరిశీలించాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురైన అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కోవూరులో భారీ చోరీ

- 27 సవర్ల బంగారం, 2 కేజీల వెండి అపహరణ



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

కోవూరు: కోవూరు శాంతినగర్‌లో 27 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు కేజీల వెండి చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు.. శంకర్‌రెడ్డి, సుశీల దంపతుల శాంతినగర్‌లో నివాసంటున్నారు. వీరి కుమార్తె స్రవంతి సంగం మండలంలోని గురుకుల పాఠశాలలో వార్డెన్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త నాగిరెడ్డి ప్రభుత్వ టీచర్. వీరు బుచ్చిరెడ్డిపాళెంలోని రేబాలలో నివాసం ఉంటున్నారు. శంకర్‌రెడ్డి దంపతులు బుధవారం ఇంటికి తాళం వేసి స్రవంతి కుమారుడు పుట్టినరోజు వేడుకల నిమిత్తం రేబాలకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు వారింటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. డ్రెస్సింగ్ టేబుల్లోని తాళంతో బీరువాను తెరిచి అందులోని 27 సవర్ల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండి చోరీ చేశారు. గురువారం ఉదయం శంకర్‌రెడ్డి దంపతులు వచ్చి చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకుని కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు నుంచి క్లూస్‌టీం వచ్చి వేలుముద్రలను సేకరించింది. ఘటనా స్థలాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

నా భూమి ఇప్పించండి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాగార్జున, కుటుంబసభ్యులు

వింజమూరు: 'మండలంలోని చౌకచర్ల గ్రామంలో నా 4.32 ఎకరాలకు సంబంధించిన హక్కులు రెవెన్యూ అధికారులు వేరే వారికి కల్పించారు. భూమిని నాకు ఇప్పించండి' అంటూ బుచ్చి గ్రామానికి చెందిన నిమ్మల నాగర్జున అనే వ్యక్తి విడవలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. నాగార్జునకు చౌకచర్లలో వారసత్వంగా 4.32 ఎకరాల భూమి వచ్చింది. దీనిని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పేరు మీద రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న నాగార్జున ఎన్నిసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. రమాదేవి వద్ద నుంచి నగదు తీసుకుని తనకు అన్యాయం చేశారని నాగార్జున వాపోతున్నాడు. అతను గురువారం కుటుంబసభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. కాసేపటికి పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా చుట్టుపక్కన వారు ఆపేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఈ భూమికి సంబంధించిన సమస్య కోర్టు పరిధిలో ఉందన్నారు.

వద్దంటే వినరే..

కొందరు వాహనదారులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ప్రధానంగా సాధారణ కార్ల నుంచి ఖరీదైన కార్ల వరకు బ్లాక్ ఫిల్మ్‌ను వినియోగిస్తున్నారు. దీని మాటున పలువురు వ్యక్తులు నేరాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. గతంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బ్లాక్ ఫిల్మ్‌పై తనిఖీలు నిర్వహించిన పోలీసు, రవాణా అధికారులు ప్రస్తుతం మిన్నకుంటున్నారు.

జిల్లాలో రెండు లక్షలకుపైగా వివిధ రకాల కార్లు

- చాలావాటికి బ్లాక్ ఫిల్మ్
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- విచ్చలవిడిగా ఎల్‌ఈడీ లైట్ల వినియోగం
- తరచూ ప్రమాదాలు

నెల్లూరు(టౌన్): జిల్లా వ్యాప్తంగా వివిధ కంపెనీలకు చెందిన 2,01,240 కార్లున్నాయి. వీటిలో 21 వేలకు పైగా క్యాబ్‌లున్నాయి. మిగిలినవి సొంత వాహనాలుగా రికార్డులు చెబుతున్నాయి. కారు తయారీ సమయంలోనే గ్లాస్‌కు 30 శాతం ఉన్న ఫిల్మ్‌ను ఆయా కంపెనీలు బిగిస్తున్నాయి. సైడ్ డోర్, వెనుక భాగంలో ఉన్న గ్లాస్‌లకు ఎలాంటి ఫిల్మ్‌లు బిగించకూడదు. దేశంలో అల్లర్లు, కిడ్నాప్‌లు, హత్యలు, లైంగికదాడుల నేపథ్యంలో సెంట్రల్ మోటార్ వెహికల్ చట్టాన్ని అమలు చేయాలని 2012లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం కారుకు ఎలాంటి ఫిల్మ్ బిగించకూడదు. హాని ఉన్న వారు, వీఐపీలు తగిన కారణాలు చూపి పోలీసుల అనుమతితో బ్లాక్ ఫిల్మ్‌ను ఉపయోగించుకోవచ్చని అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

పట్టించుకోకుండా..

నిబంధనల ప్రకారం వాహనంలో ఉన్న వ్యక్తులు బయటకు స్పష్టంగా కనిపించాలి. కానీ ప్రస్తుతం అనేకమంది కార్లకు యథేచ్ఛగా బ్లాక్ ఫిల్మ్‌ను వినియోగిస్తున్నారు. కొన్నినెలలుగా జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్, మద్యం అక్రమ రవాణా, దొంగతనాలు, కిడ్నాప్‌లు, గంజాయి, వ్యభిచారం, సెటిల్‌మెంట్లు పెరిగాయి. కార్లకు బ్లాక్ ఫిల్మ్ వేసి ఆ మాటున అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తేలింది.

విచ్చలవిడిగా..

ఇటీవల ఆటో నుంచి లారీ వరకు ఎల్‌ఈడీ లైట్ల వినియోగం పెరిగింది. బీఎండబ్ల్యూ, ఆడీ తదితర కంపెనీల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం తమ వాహనాలకే తక్కువ ఫోకస్‌తో ఉన్న ఎల్‌ఈడీ లైట్లను బిగించి మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. సాధారణంగా మెజార్టీ వాహనాల కంపెనీలు హాలోజెన్ లైట్లను వినియోగిస్తుంటాయి. ఇవి 60 నుంచి 80 యాంప్స్‌తో ఉంటాయి. అయితే కొంతమంది వాహనదారులు వాటిని తొలగించి ఎక్కువ ఫోకస్ ఉన్న లైట్లను ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. మోటార్ వాహన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు ఇలా ప్రతి వాహనానికి ఎల్‌ఈడీ లైట్లు పెట్టడం ఫ్యాషన్‌గా మారింది. దీని వల్ల రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనానికి రోడ్డు, వ్యక్తులు స్పష్టంగా కనిపించే అవకాశం ఉండదు. తరచూ ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలున్నాయి.



నెల్లూరులో కార్లకు బ్లాక్ ఫిల్మ్



వదిలేశారు

బ్లాక్ ఫిల్మ్ వినియోగంపై ఎక్కడా తనిఖీలు చేసిన సందర్భాల్లేవు. గతంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జిల్లాలో కొద్దిరోజులు హడావుడి చేసిన పోలీసు, రవాణా అధికారులు ఆ తర్వాత పూర్తిగా వదిలివేశారు. ప్రస్తుతం బ్లాక్ ఫిల్మ్‌తో పెద్ద సంఖ్యలో కార్లు రోడ్లపై తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

తనిఖీలు నిర్వహిస్తాం

వాహనాలకు బ్లాక్ ఫిల్మ్, ఎల్‌ఈడీ లైట్ల బిగింపుపై జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తాం. మోటార్ వాహన చట్టం ప్రకారం బ్లాక్ ఫిల్మ్ ఉపయోగించకూడదు. వాహనంతోపాటు వచ్చిన గ్లాస్‌ను మాత్రమే వినియోగించాలి. ప్రయాణించే వారు స్పష్టంగా బయటకు కనిపించాలి. కంపెనీల నుంచి వచ్చిన ఎల్‌ఈడీ లైట్లను మాత్రమే ఉపయోగించాలి. వాటిని మార్చి ఎక్కువ ఫోకస్ ఉన్న లైట్లు బిగించడం సరికాదు. తనిఖీలు చేపట్టి అలాంటి వాటిని తొలగిస్తాం.

– బి.చందర్, డీటీసీ



కిక్కిరిసిన వెంకటగిరి వీధులు

భక్తజన 'గిరి'

అమ్మా.. పోలేరూ తల్లీ.. కరుణించు మాయమ్మ.. కాపాడు తల్లీ.. జైజై పోలేరమ్మ తల్లీ.. అంటూ భక్తజనం వెంకటగిరి జాతరకు పోటెత్తింది. తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశ విదేశాల నుంచి ప్రజలు వెంకటగిరికి విచ్చేశారు. వాహనాలన్నీ గిరి బాట పట్టాయి. జాతరకు విచ్చేసి, అమ్మను దర్శించుకుని ఆధ్యాత్మిక తన్మయత్వం పొందారు. గురువారం జరిగిన నగరోత్సవంతో జాతర ముగిసింది.

- పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం
- కిక్కిరిసిన వెంకటగిరి
- ముగిసిన జాతర

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరి పట్టణంలో ఈనెల 24వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన పోలేరమ్మ జాతర గురువారం జరిగిన నగరోత్సవం, నిమజ్జనంతో ముగిసింది.


➡ జాతరలో భాగంగా బుధవారం అర్ధరాత్రి మెట్టినిల్లు అయిన జీనుగులవారి వీధి నుంచి వేకువజామున నాలుగు గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి పోలేరమ్మ గుడి వద్ద ప్రత్యేకంగా నిర్మించిన వేప, పుష్పాలంకరణ మండపంలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో నిలుపు చేశారు. తెల్లవారుజామున నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఉదయం మందకొడిగా సాగిన భక్తులు 9.00 గంటల నుంచి అధిక సంఖ్యలో బారులు తీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా క్యూలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు.

➡ గురువారం మధ్యాహ్నం వెంకటగిరి రాజా కుటుంబీకుల సర్వజ్ఞకుమార యాచేంద్రతోపాటు పలువురు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

➡ అమ్మవారికి సంప్రదాయ ప్రకారం దున్నపోతును బలిచ్చే కార్యక్రమం జరిగింది. అనంతరం గ్రామ పొలిమేర వద్ద పొలి కార్యక్రమం నిర్వహించారు. జాతరలో సంప్రదాయబద్ధంగా దున్నపోతును బలిచ్చి వెలిగించిన గండదీపం అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యే వరకూ ఆరిపోకుండా దుప్పటి కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. బలి కార్యక్రమం పూర్తి కాగానే గ్రామ పొలిమేరల్లో నాలుగు దిక్కులా పొలి చల్లారు.

➡ సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పోలేరమ్మను కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. ఆలయం మండపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు రాజావీధి, కాశీపేట సెంటర్, పాత శివాలయంవీధి మీదుగా మల్లమ్మగడి ప్రాంతం అమ్మవారి నిష్క్రమణ మండపం వరకు సాగింది.

➡ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



అమ్మవారి గ్రామోత్సవం

ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా షేక్ ఆయేషా బేగం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలోని ఐఎంఎల్ డిపో మేనేజర్‌గా షేక్ ఆయేషా బేగంను నియమిస్తూ ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె గతంలో చిత్తూరు డీపీఈఓగా పనిచేశారు. అదే క్రమంలో వెయిటింగ్‌లో ఉన్న ఆర్.జగదీశ్వర్‌రెడ్డిని ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌గా, జి.రమేష్‌ను ఏఈఎస్‌గా నియమించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 136
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 242
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 195

చంద్రబాబువి చిల్లర రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బుర్రా ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుర్రా, పక్కన నాయకులు

కందుకూరు: 'చంద్రబాబు నాయుడు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని వాడుకుంటున్నాడు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చిల్లర రాజకీయాలు చేయడం బాధాకరం' అని వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ అయిందంటూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు బాబు డ్రామాకు తెరలేపాడని ఆరోపించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. వాటిపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. తన వైఫల్యాలు బయట పడకుండా ఉండేందుకు సిట్ దర్యాప్తు అంటూ మరో నాటకాన్ని ప్రారంభించారన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. బాబుకు ఆ వెంకన్న స్వామే మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

సూపర్ సిక్స్ అమలెప్పుడు?

ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని బుర్రా డిమాండ్ చేశారు. బడికి పోతున్న పిల్లలు ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తామని ఆశ పెట్టారని, ఆ డబ్బులు ఎప్పుడిస్తారో తల్లిదండ్రులకు జవాబు చెప్పాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 28వ తేదీన నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో ఉన్న దేవాలయాల్లో పూజలు చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్లు ముప్పవరపు కిశోర్, చీమల రాజా, నాయకులు రావులకొల్లు బ్రహ్మానందం, గణేశం గంగిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో చేసింది శూన్యం

- హామీలు నెరవేర్చలేకనే చంద్రబాబు డ్రామాలు
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామిరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: 'కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల్లో చేసింది శూన్యం. చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం తిరుమల లడ్డూపై వివాదం సృష్టించాడు. ఆయనకు మిత్రపక్ష పార్టీలు కూడా వంతపాడుతున్నాయి' అని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కుర్చీ కోసం సొంత మామను వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబుకు ఉందన్నారు. ఇప్పుడు వెంకటేశ్వరస్వామిని వాడుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లుతున్నాడని విమర్శించారు. బాబు చేసిన పాపాల ప్రక్షాళన కోసం ఈనెల 28వ తేదీ ఉదయం 7 గంటలకు కావలి పట్టణంలోని కళుగోళమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేస్తారని వెల్లడించారు. అనంతరం వారి వార్డుల్లో, గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బాబుకు భగవంతుడు శిక్ష వేయాలని ప్రార్థిస్తారన్నారు.

ప్రజల్ని మోసం చేశారు

నమ్మి ఓట్లేసిన ప్రజల్ని చంద్రబాబు నాయుడు మోసం చేశాడని ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మోసం చేసిందని అన్ని వర్గాలు బాధపడుతున్నాయన్నారు. బాబు అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఇప్పటి వరకు సూపర్ సిక్స్ హామీల్లో ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. నిధులు లేవంటూ ఆయన కథలు చెబుతున్నాడని మండిపడ్డారు. ఈ విషయాల నుంచి ప్రజల దృష్టికి మరల్చడానికే పవిత్రమైన తిరుమల లడ్డూ గురించి చర్చించేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కావలి పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరు మాల్యాద్రి, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, వేగూరు చిన్న పుల్లయ్య, కనుపర్తి రాజశేఖర్, సన్నిబోయిన ప్రసాద్, మునీర్, పేరం వెంకటేశ్వర్లు, వేణు, కుమారి రాజు, పుల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మాగుంట పార్వతమ్మ అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మనుమడు

నెల్లూరు సిటీ: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ అంత్యక్రియలు గురువారం నెల్లూరులో జరిగాయి. అనారోగ్య కారణాలతో ఈనెల 25న ఆమె మృతిచెందిన విషయం తెలిసిందే. మాగుంట అభిమానులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని నగరంలోని సరస్వతి నగర్‌లో ఉన్న స్వగృహంలో ఉంచారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కరణం బలరాం, కంభంపాటి విజయరామిరెడ్డి, ఇంకా నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ వేనాటి రామచంద్రారెడ్డి పార్వతమ్మకు నివాళులర్పించారు. ఆమె మరిది, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని, కుటుంబసభ్యులను పరామర్శించారు.

- రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై నివాళులర్పించారు. ప్రకాశం, నెల్లూరు రాజకీయాల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి అన్నారు. తొలుత మాగుంట నివాసంలో పార్వతమ్మ పార్థివదేహానికి పోలీస్ బ్యాండ్‌తో నివాళులర్పించారు. మాగుంట అభిమానులు, ప్రజాప్రతినిధులు వెంట రాగా నగరంలో కేవీఆర్ పెట్రోలు బంకు, ఎస్2 సినిమా హాలు, విజయమహల్ గేటు నుంచి గాంధీబొమ్మ, కనకమహల్ సెంటర్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా అంతిమయాత్ర శ్మశానవాటికకు చేరింది. పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. పార్వతమ్మ మనుమడు మాగుంట సుబ్బరామిరెడ్డి (జూనియర్) అంత్యక్రియలను పూర్తి చేశారు.



పార్వతమ్మ పార్థివదేహానికి పోలీసుల గౌరవ వందనం